
# సిన్నోడినమ్మా సిన్నోణ్ణి!



**చూ**డు మిష్టర్ బాలకృష్ణా! ఇప్పటివరకు ఆ ఉత్తరాన్ని అయిదుసార్లు చదివావు, ఇది ఆరోసారి. ఏముందందులో?

"నా ఉత్తరం మాటెత్తడానికి నువ్వెవ్వరు?"

"మొదట అడిగింది నేను. బదులు చెప్పాల్సింది నువ్వు. అది సంస్కారం."

"అంటే నాకు సంస్కారం లేదంటావా"?

"–అని నేననలేదు, ఆ మాట నన్నడగడ మెందుకు? నీకు తెలియకపోతేగా?– ఇంతకూ నే నడిగింది నీ ఉత్తరాన్ని గురించి."

"నా ఉత్తరంకత నీకెందుకూ?"

"అది ప్రియురాలి ప్రేమలేఖ కాదే?"

"అవును!"

"పోనీ! ఉన్నట్లుండి చేస్తున్న ఉద్యోగం ఉన్నతికి లేదా ఉట్టికెక్కిన విషయమూ కాదు."

"అవును!"

"ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కినట్లు- ఈ దేశంలోపుట్టి ఈ దేశంలోనే పెరిగి నాలుగు తేటతెలుగుమాటల్ని అనడానికి వినడానికి నోచుకోలేనినీకు కౌలాలంపూర్‌లో తెలుగుతనాన్ని ఆస్వాదించడానికి ఆహ్వానమూ కాదు."

"అవును."

"అందుకే అడిగాను ఆరోసారి చదవడానికి ప్రయత్నిస్తూంటే!"

"ఇంతకూ నువ్వెవ్వరు?"

"చెప్పినా తెలుసుకో లేవు!"

"ఓయబ్బో! ఏమిటో ఆ అవ్యక్తవ్యక్తిత్వం?"

"నేను మనిషిలో మనిషిని. అంతర్ముఖంగా చూడగలిగితే నన్ను అద్దంలో బింబంలా చూడచ్చు."

"అయితే నాలోని నువ్వు- నన్నడగడమెందుకు!"

"నీ నోటితో చెప్పించాలని!"

"దానివల్ల నీకుకలిగే ప్రయోజనం?"

"నీ తప్పు నువ్వుతెలుసుకో గలవేమో?- అన్న దురాశ!"

"దురాశ దుఃఖానికి చేటు!"

"ఒకరిదుఃఖం ఇంకొకరికి సంతోషంగా పరిణమించవచ్చు."

"అయితే విను. అమ్మ రాయించింది."

"ఆ పల్లెటూళ్ళో... ఉడిగిన కాలంలో...పూరిగుడిసెలో...తన చెయ్యి తాను కాల్చుకోలేక...ఎవరి దయాదాక్షిణ్యాలమీదనో ఆధారపడలేక...పూట గడపడం ఓ యుగంగా- నానా అవస్థలు పడుతున్నానన్న పాతపాటే గదా?"

"కాదు."

"మరి?"

"ఈ సారి తప్పనిసరిగా నేను వెళ్ళవలసివచ్చేటట్లుంది."

"ఈ దేశంలో ఆడపాదడపా 'వీసా' అవసరం రావచ్చునేమో కానీ పల్లెటూరికి వెళ్ళడానికి 'వీసా' అవసరంలేదే?- మరి ఎందుకలా విలవిల లాడిపోతున్నావ్!"

" 'వీసా' కావలసింది పల్లెటూరికి వెళ్ళడానికి కాదు. నా ఇంట్లో నాతో కూడా నాతల్లిని ఉంచుకోవడానికి."

"నీ మీసాలేమయ్యాయి?"

"ఎప్పుడో గొరిగించుకొన్నాను- అక్కడొకటి అక్కడొకటి తెల్లబడుతూంటే!"

"మిష్టర్ బాలకృష్ణా! మూతికిమీసం అందం. మనిషికి పౌరుషం సాటిలేని అందం. పౌరుషహీనమైన బతుకు బతకడంకంటే..."

"ఆత్మహత్య మేలంటావ్?- అయితే కట్టుకొన్న పెళ్ళాం...కన్న బిడ్డలు... ఉన్నారు గదా? మరి వాళ్ళ బాధ్యత?"

"కట్టుకొన్న పెళ్ళాం... కన్నబిడ్డలు... బాధ్యతలయితే కన్నతల్లి కాదుగదా?"

"బాధ్యత కాదనుకొంటే ఆలోచించడ మెందుకు?"

"ఆలోచించి ఏం చేయగలుగుతున్నావ్?"

"ఎన్నోసార్లు అమ్మను నాతోనే ఉంచుకోవడానికి ప్రయత్నించాను."

"అయితే ఏమయింది?"

"ఎలా పిలిచినా పలకతాడు మనిషి. కానీ ఆ పిలుపుదగ్గరే ఆరంభమవుతుంది ఇద్దరికి పేచీ! 'ఒరే! సిన్నోడా!' అంటుంది అమ్మ. వందమందికి పైగా పనిచేస్తున్న ఆఫీసులో 'పెద్దయ్యగారు'గా పేరుగడించిన మొగుడు 'సిన్నోడు' కావడం పెళ్ళానికి చిన్నతనం. 'బాలూ!' అని వయ్యారాలు ఒలకపోస్తూ పిలుస్తుంది పెళ్ళాం. 'బాలకృష్ణ' అని ఎంతో ముద్దుగా పెట్టుకొన్న పేరును కోడలు తనకండ్ల ఎదుటే నిర్దాక్షిణ్యంగా చెరిసగానికి కత్తరించడం గుండెల్నే కోసినట్లుంటుంది అమ్మకు. ఏం చెయ్యమంటావ్?"

"బాలకృష్ణా! నువ్వు దోగాడుతున్న వయస్సులో చాలా అందంగా ఉండేవాడివి. ఇంతింత కళ్ళు... చిదిమితే పాలుగారే బుగ్గలు... గుబుర్లు గుబుర్లుగా వెంట్రుకలు- చూడ ముచ్చట గొలిపేది నీ రూపం. అయినా నీ తల్లికి నిన్ను చంకకెత్తుకొని అందని చందమామను అరచేతిలో చూపిస్తూ గోరుముద్దలు తినిపించడానికి తీరికెక్కడిది పాపం?- ఉన్నది రెండెకరాల కొండ్ర. అందులోపడి పొర్లాడడానికే తీరికలేదు. ఇక నిన్నెలా ఎత్తుకొని ముద్దులాడుతుంది? అయినా ఆడికో... అమావాస్యకో ఓ దినం ఊపిరి సలుపుకోగలిగితే చాలు. ఎంతో సంబరపడిపోయేది!

నీకు తెలుసునో తెలియదో మిష్టర్ బాలకృష్ణా! నీ పక్కింటి మేడకు మెడబిర్రు ఎక్కువ. అయినా మీ అమ్మ మంచితనంముందు ఆ మెడబిర్రు మెలికలు తిరిగేది. సాదుచిప్పా... పౌడరు డబ్బా- మెడబిర్రుకు మెరుగులు దిద్దే రెండు మూడు నగలూ- మిద్దింటి నుండి గుడిసింటికి 'సద్దూసడీ' లేకుండానడిచి వచ్చేవి. ఆ రోజు నీకు చక్కగా స్నానం చేయించేది. ఒళ్ళంతా పౌడరుదిద్దేది. గుబురు వెంట్రుకల్ని ముందుకు దువ్వి 'కృష్ణకొండి' వేసేది. అలా అలంకరిస్తే నువ్వు అచ్చం బాలకృష్ణుడిలా ఉండేవాడివి. అప్పుడామె చేతుల నుండి విడిపించుకొని ఆమె చేతికి చిక్కకుండా పరుగులుదీస్తూ అల్లరి చిల్లరి పనులు చేస్తూంటే- ఎలాగో తరిమి పట్టుకొని- గుండెల కదుముకొని 'నా చిన్ని కిష్టుడమ్మా! నా చక్కని కిష్టుడమ్మా!! అని ముద్దులాడేది. అందుకే ముచ్చటపడి 'బాలకృష్ణ' అని పేరు పెట్టుకొనింది.

"అవును! లీలగా జ్ఞాపకమొస్తూ ఉంది."

"మిష్టర్ బాలకృష్ణా! మీదొక పూరిగుడిసె. గుడిసెముందొక మేడ. ఆ మేడలో మనుషులకు మెడమీద కండలు. కండగలిగిన కామందులకు ఓ దొండపండులాంటి బిడ్డ. కన్న పేగు ఎన్నో పాట్లుపడింది- ఎదిరింటితో పోటిపడి నిన్ను పెంచడానికి. కాబట్టే ఈ నాడు నీవీ మాత్రం కుర్చీలో నింపాదిగా కూర్చోగలిగావు."

"అవును."

"అన్నిటికీ 'అవును! అవును!!' అని గంగిరెద్దులా తలూపుతున్నావే? నీ పెళ్ళానికి ఈ మాత్రం నచ్చచెప్పుకోలేకపోయావ్?"

"చెప్తే- ఏఁవండీ? ఏఁవిటా ఏకిరి పోకిరి పిలుపులు?- సిన్నోడా! పెద్దోడా!! అని... అచ్చం పల్లెటూరి అవతారాల్లాగా? వయసు పెరిగితే ఏం లాభం? వర్తన పెరగాలి కానీ! ఆ మాత్రం మర్యాదగా మసలుకోమని చెప్పలేకపోయారా మీ తల్లిగారికి!" అని దెప్పి దెప్పి పొడుస్తుంది పెళ్ళాం!"

"తల్లికి మర్యాదలు నేర్పాలా?"

"కాదు, పెళ్ళానికి తృప్తి కలిగించాలి."

"అడకత్తెరలో పోకవు."

"ఏం చేయమంటావ్?- అమ్మ రమ్మంటే వస్తుంది. ఓ రెండు మూడునాళ్ళు ఏ బెడదా ఉండదు. ఆ తరువాత కోడలు అత్తమీది కోపాన్ని దుత్తమీద చూపుతుంది. ఈ కోడలు కూడ ఒకనాటికి 'తల్లి' అవుతుందన్న సంగతి మరిచిపోతుంది. ఎటూ మాట్లాడలేక నేను నలిగిపోతూంటే- నా అసమర్థతను చూసి అసహ్యపడవలసిన అమ్మ జాలిపడుతుంది."

"అది కన్నపేగు."

"అందుకే వచ్చినంత త్వరగా ప్రయాణం కడుతుంది."

"మిష్టర్ బాలకృష్ణా! నీకు అధికారముంది. నీ మాటంటే ఆఫీసులో హడలిచస్తారు. నీకు ఐశ్వర్యముంది. ఆశించింది అరిచేతిలోకి నడిచి వస్తుంది. నీకు దేనికీ దిగుల్లేదు. అయినా నువ్వు కనీసం మానసికంగా యాతనపడడం కూడా నీ తల్లి సహించలేక పోయింది. అందుకే వచ్చిన మూడోనాటికే మూటాముల్లె సర్దుకొంటుంది."

"అవును."

"అది కన్నపేగు."

"నేను కాదన్నానా?"

"కాదనడంలేదు. ఔననడంలేదు."

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"వెనక్కు తిరిగి చూడమంటాను."

"చూస్తూనే ఉన్నాను."

"చూస్తే ప్రయోజనం?– ఆలోచించాలి కానీ..."

"ఆలోచిస్తూనే ఉన్నాను."

"ఏమని?"

"అమ్మకు బాగా వయసుమళ్ళింది. కూర్చుంటే లేవడం కూడా కష్టం. లేస్తే కూర్చోవడం కష్టం. ఆమెకు తోడుగా ఓ మనిషి అవసరం. ఆమెకు స్నానం చేయించాలి. బట్టలు కట్టాలి. వేళకంత తినిపించాలి. ఆమె శంకలు తీర్చాలి. నేనామెకు బిడ్డనే! ఆమె నాకు తల్లే!– అయినా కూడా మగవాడుగా ఈ పనులన్నీ నిర్వహించచడం కష్టం. తోడుకు ఉద్యోగమొకటేడ్చింది!– ఉదయాన వెళ్ళితే సాయంకాలమే తిరగి రావడం. ఈ లోపుగా ముసలావిడ గతి?– ఆమె నోరారా 'సిన్నోడా!' అని పిలుస్తుంటేనే సహించలేని ఆడది– ఆమెకు సపర్యలు చేస్తుందా? ఓ పనిమనిషిని పెడితే తనసపర్యలు చేయించుకోవడంతోనే సరిపెట్టుకొంటుంది?"

"అయితే ఏం చేద్దామనుకుంటున్నావ్?"

"పున్నెంకొద్దీ పురుషుడు. అదృష్టం కొద్దీ బిడ్డలు."

"మనిషి స్వార్థంతో అందంగా అల్లుకొన్న పదాలు."

"కాదు– అనుభవం నేర్పిన పాఠాలు."

"అయితే ఇప్పుడీ పాఠాల్ని తల్లిమీదనే ప్రయోగించడానికి తలపడుతున్నావ్?"

"తప్పేటట్టు లేదు."

"ఈ సాహసానికే మీతల్లి ఒడిగట్టుంటే"

"గతాన్ని తవ్వుతావెందుకూ?"

"ఏం?– చేదుమాత్రలు మింగినట్లుందా?"

"లేదు. చెవిటికి శంఖూదినట్లుంది."

"ఫరవాలేదు. ఈ మాత్రం ఇంగితజ్ఞానమైనా మిగిలి ఉంది. అందుకు నిన్ను తప్పకుండా అభినందించి తీరాలి."

"అభినందన సంగతి దేవుడెరుగు. అవసానదశలో అమ్మను ఆదరించలేని దౌర్భాగ్యుడన్న అవమానంనుండి విముక్తిదొరికితే చాలు."

"మనిషి ఇంత పిరికివాడు కాకూడదు భాయీ!"

"అని అనుకుంటూనే ఉన్నాను."

"మిష్టర్ బాలకృష్ణా! మీ నాన్న ఓ సన్నకారు రైతు!"

"కాదు. ఓ రెండెకరాల సేద్యగాడు."

"కదామరి? ఆ రెండెకరాల కొంద్రతో మీ అమ్మానాన్న ఎలా సతమత మయ్యేవాళ్ళో తెలుసా నీకు? అప్పుడు తెలుసుకునే వయసు కూడా కాదు నీది."

"అవును."

"ఆ వయస్సులోనే మీనాన్న పోయాడు."

"తెలుసు"

"ఏం తెలుసు?"

"మా నాన్న బావిలోపడి చనిపోయాడని!"

"మీ నాన్న బతకలేక బావిలోపడలేదు. ఇంటిలోని పోరుతో విసిగి బతుకును బావిపాలు చేసుకోలేదు. అప్పుల నుండి విముక్తి పొందడానికి ఆత్మహత్యకు తలపడలేదు. ఓ రోజు తెల్లవారుజామున మడికి తడివెయ్యడానికి మోటతోలుతున్నాడు. బాన సరిగ్గా మునగలేదు. బాగా ముంచడానికి ఎద్దుల్ని వెనక్కు లాగుతున్నాడు. అలాంటి సమయాల్లో పగ్గాల మోపుతో మనిషి బావివైపు బాగావాలి ఉంటాడు. ఉన్నట్లుండి బావిదరువు ఉర్లిపడింది. దోర్నం పట్టె... గురుజులు... తన్ను కొయ్యలు... అన్నీ అలానే బావిలో దొర్లుకుంటే- వాటి వెంటనే మోట తోలుతున్న మీ నాన్న, ఎద్దులు, బావి పరమయ్యారు. ఆ 'పూటిమట్టి' కింద నలిగిపోయిన మీనాన్న శవాన్ని పైకి తీసేడానికి రెండురోజులు పట్టింది. అలాంటి దుర్ఘటన ఆ పాయ కట్టులో అదివరకెప్పుడూ జరగలేదు."

"దురదృష్టం"

"నీదికాదు. మీ అమ్మది. పసుపు కుంకుమలతో మిసమిసలాడే నీ తల్లి మొగం వసివాడింది. నువ్వుపుట్టే నీ తండ్రిని పొట్టన పెట్టుకొన్నావన్నారు ఆ పల్లెజనం. అయినా నీతల్లి నిన్ను గుండెల్లోపెట్టుకొని ఎన్నిఅగచాట్లు పడిందో నిన్నీస్థితికి తెచ్చేదానికి!- గుర్తుందా నీకు?"

"లేకేమి?"

"ఉంటే- ఆమె నీతోనే ఉండేది"

"ఉండద్దని నేనెప్పుడూ చెప్పలేదే?"

"అయినా ఉండలేక పోయింది. ఎందుకు? పొంగుతున్న నీ సంసారంలో ఒక ఉప్పుగల్లు కాలేక."

"అదికూడా నాతప్పేనంటావా?"

"కాదు. నిన్ను కనడమే ఆమె తప్పు"

"ఒక్క క్షణం ఆగు. ఇప్పుడే వస్తున్నాడు. వీడెవడో పానకంలో పుడకలాగ!"

"మిష్టర్ బాలకృష్ణా! నీ అధికారం గొప్పది. ఈ ఆఫీసులో నీ హోదా గొప్పది. వంచిన తల ఎత్తకుండా పనిచేయాల్సిన బాధ్యత అంత కంటే గొప్పది. అయినా ఇంతవరకు ఈ ఆఫీసు నీమీద దయతలిచింది. నీ మానాన నిన్ను వదిలింది. అంతవరకు అదృష్టవంతుడివి. అది సరేకానీ ఆ వస్తున్నవాడి సంగతేమిటో మొదట తెల్చు!"

"తేలస్తా! తేలస్తా!! వాడూ వాడి మొగం. చేతిలో కాగితం...కండ్లలో తడి...వంగి వంగి నడవడం... సెభాష్! వీడి నాటకం బాగా రక్తి కడుతుంది. ఇంతకూ ఈ వెధవ వేషాలన్నీ ఒకటి రెండు రోజుల సెలవు కోసమే ఉంటుంది?"...

"సార్!"

"ఊఁ!...... చెప్పు!"

"మా అమ్మ....."

"ఆఁ! మీ అమ్మ- కోడలికి నాకూ బొత్తిగా పడడంలేదు. నే వెళ్ళి పోతాను అంటూ ఉందా?"

"కాదు సార్!"

"మరి?"

"చావు బతుకుల్లో ఉందట! టెలిగ్రాం వచ్చింది సార్?... చూడండి సార్!... ఆ పల్లెటూళ్ళో దిక్కుదరీ లేదుసార్! గొంతులో అంత మందు పోయడానిక్కూడా డాక్టర్లుండరు. ఒక వేళ నేను వెళ్ళేటప్పటికే..." ఎగ్గొట్టుకొస్తున్న ఏడుపు మాటల్ని మింగేసింది.

"అయితే సెలవు పెట్టి వెంటనే వెళ్ళిపో!"

టెలిగ్రాం మీద యక్ష ప్రశ్నలు... చావు బ్రతుకుల్లో ఉన్న అమ్మ మీద సవాలక్ష ప్రశ్నలు- కోడిగుడ్డుకు ఈకలు పెరికే రకం ఆఫీసరు... మారు మాట్లాడకుండా సెలవు మంజూరు చేసేసరికి- వచ్చిన మనిషి ఉబ్బి తబ్బిబ్బులై పోయాడు. అమ్మకు బాగైపోయినంత ఆనందపడ్డాడు. 'థ్యాంక్యూ సార్!... థ్యాంక్యూ సార్!' అని తనలో తానే గొణుకుంటున్నట్లుగా గట్టిగానే అంటూ బయటపడ్డాడు!...

బాలకృష్ణ మళ్ళీ ఒంటరివాడై పోయాడు.

అతని నెత్తిమీద పంకా తిరుగుతూనే ఉంది.

అతని బుర్రలో ఆలోచనలు మళ్ళీ రెక్కలు విప్పుకొన్నాయి!...

"మిష్టర్ బాలకృష్ణా! తల్లి చావుబ్రతుకుల్లో ఉంటే చూశావా అతడెలా తల్లడిల్లి పోతున్నాడో?"

"చూశాను. అందుకేగదా వెంటనే సెలవు మంజూరు చేశాను"

"తల్లి చనిపోతూంటే- పొయ్యే ప్రాణాన్ని పట్టుకొంటే నిలుస్తుందా? అని అడిగే కొడుకులున్నారు. తొమ్మిది నెలలుమోసి కనీపెంచి పెద్దచేస్తే- ఆ పెద్దరికానికి దెబ్బ తగులుతుందన్న భయంతో "నాతల్లి" అని చెప్పుకోవడానికి నామూషీపడే కొడుకులున్నారు. కొడుకులు సంపాదించిన ఆస్తిపాస్తులతో కోడళ్ళు పెత్తనం చలాయిస్తూ కులుకుతూ ఉంటే- ఆ ధాటికి చిత్తయిపోతున్న తల్లుల్ని చూస్తూ నిస్సహాయంగా నిలబడిన కొడుకులున్నారు. వాళ్ళల్లో నువ్వూ ఒకడివై పోతున్నావేకానీ..."

"ఏం చేయాలి? సమ్మెల గొడవలు...రాత్రుల్ని పగళ్ళుగా మార్చుకొన్నా తెమలని పనివత్తిడి...పై అధికార్ల గూటింపులు... ఆఫీసు ఇన్ని గొడవల్లో మునిగి తబ్బిబ్బులవుతుంటే..."

"నీ సిన్సియారిటీకి జోహార్లు! అయితే ఆత్మవంచన!!– మంచిపని కాదు."

"ఆత్మవంచనా?"

"కదామరి? ఎదుటివాణ్ణి మోసంచేస్తే అదివంచన. తన్నుతానే మోసం చేసుకుంటే ఆత్మవంచన!"

"ఆత్మవంచనకే పాల్పడి ఉంటే నాకీ పేరు ప్రతిష్టలు వచ్చేవి కావు. ఈ ప్రమోషన్ వచ్చేది కాదు. ఇంత గౌరవంగా బతికే వాడిని కాదు. ఆత్మ వంచన చేసుకోవలసిన 'ఖర్మ' నా కెప్పుడూ పట్టలేదు."

"ఎప్పుడూ పట్టలేదు. కానీ ఇప్పుడు పట్టింది."

"అసలే ఎత్తిపొడుపులు! అందులో డొంక తిరుగుళ్ళు."

"మిష్టర్ బాలకృష్ణా! మతిమరుపుకు కూడా ఓ మితముంది. మరిచి పోవడానికి ఇంకా నెల తిరగలేదే?– మీ అత్తగారికి 'సీరియస్' అంటూ ఓ టెలిగ్రాం వచ్చింది. జ్ఞాపకముందా?"

"ఉంది"

"ఆ రోజు ఎంత హడావుడి పడ్డావో? బ్యాంకు వేళ దాటిపోయేసరికి ఎవరెవరికి ఫోన్లు చేశావో? అడగరాని వాళ్ళనంతా అడిగి డబ్బుకెంత ఇబ్బంది పడ్డావో? మతికి తెచ్చుకో? కాలుగాలిన పిల్లిలా నిలిచినచోట నిలవలేక పోయావు. ఎన్ని ఇబ్బందుల్నయినా నిబ్బరంగా ఎదుర్కొన్నావు. కడకు కారుమీద హుటాహుటి బయలుదేరావు."

"అవును"

"అప్పుడు? 'ఆఫీసు ఇన్స్పెక్షన్' జరగడం లేదా? నీ అసిస్టెంట్లు ఒక్కరికి ఇద్దరు ఒక్కడేమో భార్య ప్రసవించిందని... ఇంకొక్కడేమో కూతురు పెళ్ళని సెలవులో ఉన్నారు గదా? ఆఫీసు బాధ్యతలన్నీ అమాంతంగా నీ నెత్తిమీదనే పడ్డాయికదా?– మరి ఆ రోజు అడ్డపడని ఆఫీసు బాధ్యతలు– ఈరోజు ఉన్నట్లుండి బాధ్యతలై తలకెక్కాయి."

"ఆ రోజు...."

"ఆ రోజు...నీ పెళ్ళాన్ని 'ప్లీజ్' చెయ్యడం నీ ధ్యేయం."

"ఒక విధంగా ఆలోచిస్తే అంతే అనిపిస్తూ ఉంది."

"బుద్ధిమంతుడివే!_తలకేస్తే మొలకు మొలకేస్తే తలకన్నట్లుగా వాదించకుండా ఆ మాత్రం ఒప్పుకొంటున్నావ్. మంచిది. అత్తగారింటికి వెళ్ళావు. వెళ్ళితే ఏమయింది. అత్తగారికి జ్వరం. లేదంటే– కాస్త తీవ్రంగా ఉంది. దానికే అక్కడి హంగామా అంతా గమనించావు. కొంపలు మునిగి పోతున్నట్లు ఇంటి నిండా జనం. వచ్చే పొయ్యేవాళ్ళ సందడి. అయిదు నిముషాల కొక్కసారి డాక్టర్ పరీక్ష. ఆ సంతను చూసి సన్నగా నవ్వు కొన్నావు. 'ఇది కలిగిన వాళ్ళ ముచ్చట' అని నీలోనువ్వు సరిపెట్టు కొన్నావ్."

"అవునవును!"

"ఆ మీఅత్తగారు నీపెళ్ళానికి తల్లిగారు"

"వడ్ల గింజలో బియ్యపు గింజ"

"ఈ సత్యాన్నే గ్రహించలేని నువ్వొక పొట్టుగింజ"

"తిన్నగారానీ మాటలు"

"ఏం? కొడతావా?"

"ఆశ్చర్యమేముంది?"

"హ్హ హ్హ హ్హ! అసమర్థుడు అంతకంటే చేయగలిగిందేముంటుంది?– ఎదుటి వ్యక్తిమీద చూపలేని ప్రతాపాన్ని తనమీద తానే చూపుకొంటాడు. చేతికందిన దానితో తనకు తానే కొట్టుకొంటాడు."

"మాటలు పేనడమెందుకూ? ఈ అసమర్థుడు గ్రహించలేకపోయింది– నువ్వు గ్రహించిన సత్యమేమిటో చెప్పరాదూ?"

"అదే!– నీ అత్త నీ పెళ్ళానికి తల్లి. నీ పెళ్ళాం ఆ తల్లికి కూతురు. ఆ తల్లి ఆ కూతుర్ని ఎలా పెంచిందో తెలుసా?– తనపాలిస్తే తనసౌందర్యం తరిగిపోతుందని పిల్లకు పోతపాలు పట్టించింది. 'ఏందండీ? పాపకు పోతపాలు పడుతున్నారా?' అని ఎవరైనా అడిగితే– 'కన్న కసమాళం తిని మనమిచ్చే పాలకంటే– పోతపాలు ఎన్నో రెట్లు ఆరోగ్యకరం కదండీ?' అని దీర్ఘాలు తీసింది. ఆ పిల్లని ఆయాల చేతులకప్పగించి తానేమో క్లబ్బులని సాంఘిక సంక్షేమ కార్యకలాపాలని జల్సాగా ఊరిమీద పడింది. అలాంటి తల్లికోసమే– ఆ పిల్ల అంత తహతహ లాడిందే?– మరి నీతల్లి! ఒక చంకలో కూర్చుని నువ్వు వదలకుండా లాగుతూంటే ఇంకొక చేత్తో ఆమె పనులు చేసుకొనింది."

"అవును."

"నీతండ్రి అకాలమృత్యువు వాతపడ్డాడు. ఏ మాత్రం స్వార్థపరురాలైనా ఆమె ఆ వయస్సులో ఇంకొకరి చేతుల్లో పడేది. కానీ నీకోసం నీతిగా నిలబడింది. నమ్ముకోవడానికి నా అనే వాళ్ళు లేకపోయినా– తన రెక్కల్ని తాను నమ్ముకొనింది. కూలి కొడవలి చేతపట్టింది. ఉన్న రెండెకరాలను గుత్తకిచ్చింది. మిస్టర్ బాలకృష్ణా! నీతల్లి బతుకులో పొద్దు మొగం చూసింది– పొద్దుబారడెక్కి నపుడే!– అప్పుడు వంచేది. నడుం పొద్దుగూట్లో పడితేనే పైకి లేచేది. దీనికి ప్రతిఫలం– అంటే 'కూలి' ఎంతో తెలుసా? రెండు ముద్దల సంకటి రెండు మానెళ్ళ గింజలు?"

"............................"

"ఏడుస్తున్నా వెందుకూ?"

"ఆహా! కంటిలో ఏదో నలుసు పడింది."

"కలిగిన మాటలు ఎప్పుడూ కంటిలో నలుసులే!"

"చచ్చిన పామును కొడుతున్నావ్?"

"పాము చావలేదు బాలకృష్ణా! అలా భ్రమకల్పిస్తూ ఉంది!"

"బదులు చెప్తే గోడపెట్టు చెంపదెబ్బ రెండూ నాకే తగులుతున్నాయి."

"అయితే బదులు పలక్కుండా బుద్ధిగా విను."

"ఇంకా ఏముంది వినడానికి!"

"ఇదో!– మాట్లాడనన్నావు. మళ్ళీ మాట్లాడుతున్నావు. నువ్వు మాట్లాడితే బదులు చెప్పాల్సి వస్తుంది. బదులు చెప్తే బాధపడతావు."

"..............................."

"ఇదీ బుద్ధిమంతుడి లక్షణం. మిష్టర్ బాలకృష్ణా! మనిషి భవిష్యత్తును గురించి ఆలోచించనంత తీవ్రంగా గతాన్ని గురించి తలపోయడు. ప్రతి బతుకులో మిట్టాపల్లాలుంటాయి. మిట్టమీది మనిషి పల్లంలో పడవచ్చు. పల్లంలో మనిషి మిట్టమీది కెక్కవచ్చు. అయితే సాధారణంగా మనిషి పల్లంలో పడ్డప్పుడు మిట్టను గురించి చెప్పుకొన్నంత హాయిగా మిట్టమీద నిలబడిన మనిషి పల్లాన్ని గురించి ప్రస్తావించడు. అలా ప్రస్తావించడానికి నామూషీ పడతాడు. నువ్వూ అంతే! నువ్వు పైకి వచ్చావు. ఎంత పైకి వచ్చావంటే– ఇక్కడ నిలబడి తిరిగిచూస్తే నువ్వు ఉండిందొక అగాధమైన ఇరుకులోయ. ఆ ఇరుకులోయను గురించి ఆలోచించలేవు. ఆలోచించడానికి ఆస్కారమూ లేదు. ఈ రంగు రంగుల జీవితం... ఈ హంగుసింగుల అధికారం– అన్నీ ఆకాశం నుండి ఊడిపడ్డట్టుగానే భావిస్తున్నావు కానీ, నువ్వు ఇంత దర్జాగా బతకడానికి ఇంకొక్క జీవిచెమట కారణమని ఆలోచించలేక పోతున్నావ్.

ఆ జీవి ఎవరో కాదు– నీతల్లి!

ఆ తల్లి తూర్పున పటమెగరకముందే నిద్ర లేచింది. తానుమొగం కడుక్కొంటుందో లేదో కానీ గుడిసెముందుమాత్రం కడిగికళ్ళాపు చల్లింది. తానుచన్నీళ్ళతో మొగం కడుక్కుంటే వేడినీళ్ళతోనే నీ ఒళ్ళు కడిగింది. ఆ తరువాత కూటికుండలో చేయిపెట్టి దేవిదేవి చేతికందిన నాలుగు మెతుకుల్ని నీకు తినిపించింది. తాను కడుపు నింపుకొనేది మిగిలిన ముంతడు కూటినీళ్ళల్లో ఓ ఉప్పుకల్లువేసి!

ముదిగారం ముక్కుకు దారంగావేసి నిన్ను బడికి పిలుచుకొని పోయేది. అక్కడ నిన్ను వదిలిపెట్టి పరుగందుకొనేది– కూలికోసం! కలిగినవాళ్ళ పైరు నాటేదానికి కావచ్చు. పైరు కోతకైనా కావచ్చు. లేదా– దిబ్బల్లోని ఎరువు గంపలకెత్తి పొలాలమీద చల్లడానికైనా కావచ్చు. ఆమె అక్కడికి వెళ్ళేటప్పటికే కూలీలు పనిలోవొంగి ఉండేవాళ్ళు!"

"ఏచవే సెల్లెమ్మా? ఒక్క అడుగు ముందుగా వచ్చేదానికి నీకు తీరిందెప్పుడే? ఏదో బతికి సెడిందనుకుంటే– దానికీ ఒకమితముండక్కర్లా?" గనిమమీద నిలబడి రెడ్డమ్మ కమ్మగా రాగాలు తీస్తుంది.

కలిగినవాళ్ళు. ఆలస్యంగా వస్తే అనగలిగిన నోళ్ళు. అంటాయి. చేస్తున్నది కూలి. పడక తప్పదు.

అందుకే ఆమె నోరు కదపకుండా పనిలో దిగేది. పైరు నాటేది కానీ– లేదా కలుపు తీసేది కానీ– నడుం వంచి ఆమె 'మునం' పట్టిందంటే చేతులు పంతాలు పడేవి. తీరా తిరిగిచూస్తే అందరికంటే ముందుదేది. ఆలస్యంగా వస్తే రాగాలాపనలు చేసే నోళ్లు– 'మునం' ముందుగా ముగిస్తే మూగబొయ్యేవి. అదివాటి లక్షణం. ఆ లక్షణం బాగా వొంటపట్టింది కాబట్టే వాళ్లు గనిమలమీద రెడ్డమ్మలుగా నిలబడగలిగారు.

పొద్దునడిమిట్టకు వస్తుంది. అది సంకటివేళ. ఆవేళప్పుడు అందరు చేతులు కడుక్కొంటారు. ఆ దరిదాపుల్లో ఓ చెట్టునీడను చేరతారు. రెడ్డెమ్మ తలకొక్క ముద్ద సంకటి వేస్తుంది. ఎడమచేతి అరిచేయి ఆకు అవుతుంది. అరిచేతి ఆకుల్లో సంకటి ముద్ద. ఆ ముద్దను గుంత చేసుకొంటారు. ఆ గుంతలో రెడ్డెమ్మ ఓ అబకచారు పోస్తుంది. ఆ ముద్ద తింటూనే మరొక్క ముద్ద. తాటికాయంత ఉన్న ఆ రెండు ముద్దల సంకటిని గొంతు కూర్చునే గుట గుట మింగుతారు. రెండు అరచేతుల్ని అలానే ఆనించి దోసిలిపట్టి మూతికి ఆనించు కొంటారు. ఆ దోసిట్లో నీళ్ళుపోస్తుంది రెడ్డెమ్మ. అలానే రెండు దోసిళ్ళ నీళ్ళు తాగుతారు. ఆ నీళ్ళతోనే చేతులు కడుక్కొంటారు. ఆ చెట్టుకింద అలానే నడుం వాలస్తారు. ఎంతసేపు?– కలిగినవాడు కమ్మగా ఆకూవక్క నమిలినంతసేపు!–

అయితే మిష్టర్ బాలకృష్ణా! నీతల్లి అందురు చేతులు కడుక్కొని చెట్టునీడను చేరేసరికి ముద్ద సంకటి నోట్లో వేసుకొనేది. అందురు ఓ ముద్ద సంకటిని చేతికి అందుకొంటుంటే నీ తల్లి రెండో ముద్దను చేతికెత్తుకుండేది. ఆ ముద్దసంకటికి పైటకొంగు కప్పి అడ్డదారిమీద పడి 'ఆసో బోసో' మని ఇంటికి వచ్చేది. అప్పటికే గుడిసెలో ఒంటరిగా కూర్చొని ఒళ్ళంతా కళ్ళుచేసి అమ్మకోసం నువ్వు ఎదురు చూస్తూ ఉండేవాడివి. అమాంతంగా చంకకెత్తుకొని ముద్దులాడుతూ ముద్దసంకటి నీకు తినిపించేది. మళ్ళీ నీకు బడిదాకా తోడు. నిన్నక్కడ వదిలిపెట్టి ఒక్క లగువులో పొలానికి వెళ్ళేది. అప్పటికే కూలీలు పనిలో వంగి ఉండేవాళ్లు. ఇక రెడ్డమ్మ దీర్ఘాలా? సరేసరి!–

మధ్యాహ్నంపూట అందరు అలా చెట్టునీడలో నడుంవాలిస్తే నీతల్లి ఆమాత్రం అదృష్టానికి కూడ నోచుకోలేక పోయింది.

మిష్టర్ బాలకృష్ణా! నువ్వు పుట్టి పెరిగిందొక పల్లెలో!– ఆపల్లెకు నాలుగు మైళ్ళు దూరంలో ఓ పేట. తూర్పున అంతే దూరంలో మరొక్క పేట. వారానికి రెండు రోజులు ఆపేటల్లో సంతలు జరగతాయి. ఆ సంతల్లో రైతులు తాము పండించినవి అమ్ముకొంటారు. తమకు కావలసినవి కొనుక్కుంటారు.

నీ తల్లికూడా సంతలకు వెళ్ళేది. గుడ్డాగుసురు కొనడానికి కాదు. పండించినవి అమ్మడానికి కాదు. ఓ గాడిద బరువు నెత్తికెత్తికొని వెళ్ళేది. ఆ బరువు... ఎర్రగడ్డలో... తమలపాకులో...

కాయకూరలో– ఏదైనా కావచ్చు. నెత్తిబరువుకు తోడు ఎండ నెత్తిమీద ఉంటుంది. ఆ ఎండ పొద్దున చెమటలు కక్కుతూ నాలుగుమైళ్ళు నిమిషం అలా నిలబడేది కాదు. ఆ కష్టానికి ప్రతిఫలం– అంటే 'కూలి' ఎంత? ఓ ముష్టి రూపాయి!!

అంతటితో ఊరుకొంటుందా?– ఉండదే? సాయంకాలం వరకు పేటలోనే పడిగాపులు కాస్తుంది. మళ్ళీ ఓమూట నెత్తికెత్తుకొంటుంది.మధ్యాహ్నం మోసుకొచ్చిన మూట సాయంకాలానికి రూపాంతరం చెందుతుంది–కలిగిన వాళ్ళ ఇంటికి కావలసిన సరుకులుగా!

మిష్టర్ బాలకృష్ణా! ఒక్కొక్కరోజు ఆమె పేటనుండి రావడానికి ఆలస్యమయ్యేది. నీ లేతగుండె తట్టుకోలేక తపన పడేది. అందుకే అలాంటి సమయాల్లో నువ్వు 'ఎదురుసేవ' వెళ్ళేవాడివి. కనుచీకటి ఆవరిస్తున్న వేళల్లో ఆ బాటమీద కనుచూపు మేరలో ఓ స్త్రీ ఆకారం కంటపడితే చాలు. మీ అమ్మే అనుకొనేవాడివి. 'అమ్మా!' అంటూ పరుగెత్తి ఆ ఆకారం కాళ్ళకు పెనవేసుక పోయేవాడివి.

"ఒరే! నాబట్టా! కిట్టిగా!... నేను కదంట్రా?... మీ అమ్మ ఇంకా ఎనకాల వస్తావుండాది" అని అంటూ గలగల నవ్వేదా ఆకారం.

నీ మూతి ముడుచుకొనేది!

ఆ తరువాత అడుగడుగులో సందేహం! కంటపడిన ఆడ ఆకారం అమ్మ అవునో? కాదో? అన్న సందేహం!– ఆ సందేహంలో అడుగుమీద అడుగుపడేది. తీరా మీ అమ్మ ఎదురుపడినా నీ సందేహంమాత్రం నిన్ను వదిలేది కాదు. అప్పుడు మీఅమ్మే 'ఒరే సిన్నోడా! నువ్వా!! ఈ సీగిట్లో ఇంతదూరం వొంటిగా వొచ్చేస్తివే! యాడైనా నక్కా గిక్కా నోటగర్చుకొని పొయ్యుంటే ఏం చేసేదబ్బా?' అని అంటూ అమాంతంగా నిన్ను జవురుకొనేది. చంకన వేసుకొనేది. నెత్తి బరువుకు మళ్ళీ నువ్వు తోడు. అయినా ఆ మాతృ హృదయం లెక్కపెట్టేది కాదు. సంతలో కొనుక్కొని వచ్చిన ఒక వడనో మురుకునో నీ చేతికిస్తే ఎంత సంబరపడి పోయే వాడివో?– గుర్తుందా మిష్టర్ బాలకృష్ణా?

పొలాల్లో కూలిపనులు చేసింది.పేటకు నెత్తిబరువులు మోసింది. ఆ పనులు దొరకనపుడు... అడవికి వెళ్లే ఓపిక లేనపుడు ఆలమందల వెంటపడింది. పేడ ఏరి తెచ్చింది. దిబ్బపోసి పెట్టింది. ఆ దిబ్బను పంట ఎరువులకని అమ్మింది. ఎందుకు? జానెడు పొట్ట పోసుకోవడానికి కాదు. నీ భవిష్యత్తు కోసం!

ఆమె నీ తల్లి!– నువ్వు ఆమెకు బిడ్డవు!

ఆమెకు ఏమీలేదు. వెనకా ముందు ఎవ్వరూలేరు. అష్టకష్టాలు పడింది.

తల్లిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చుకో గలిగింది.

నీకు అన్నీ ఉన్నాయి. హాయిగా బతుకుతున్నావు. అయినా అవసానదశలో ఆ తల్లి బాధ్యతల్ని చేపట్టలేక పోతున్నావు.ఇదే లోకరీతి! మిష్టర్ బాలకృష్ణా! ఓ తల్లికి అయిదారుగురు

బిడ్డలుంటారు. ఆతల్లి ఆ బిడ్డలందరికీ పాలిస్తుంది. అందర్నీ సమంగా చూస్తుంది. కానీ ఆ అందురు కలిసి ఆ ఒక్కతల్లి బాధ్యతల్ని మాత్రం మోయలేరు. అదే విచిత్రం! ఇంకా సిగ్గుపడాల్సిన సంగతేమిటంటే_ ఆ తల్లి బాధ్యతల్ని మోసేటప్పుడు పిల్లలు వంతులు పోతారు!

కళ్ళల్లో నీళ్ళు!

ఎందుకు మిష్టర్ బాలకృష్ణా? ఈ పరిస్థితిలో కూడా నీ కళ్ళల్లో నీళ్ళు చూస్తే ఆ తల్లి గుండె తల్లడిల్లుతుంది. అన్నట్లు_ ఆ తల్లి రాయించిన ఆ ఉత్తరాన్ని ఆరోసారి చదవపోతూంటే అడ్డు తగిలాను. ఏదీ_ ఒక సారి నోరారా చదువు. విందాం!

"........................"

"మిష్టర్ బాలకృష్ణా! ఇంకా కళ్ళల్లో నీళ్ళు కారుతూనే ఉన్నాయి. అదే వద్దన్నాను. నువ్వు మహాఅందగాడనుకొంటుంది నీ స్టెనోటైపిస్ట్. అందుకే అలంకరించుకోవడంలో మహా జాగ్రత్త పడుతుంది. పూవుచుట్టు తుమ్మెదలా నీచుట్టూ తిరుగుతుంది. ఇప్పటికే ఏదోనెపంతో ఓ అయిదారుసార్లయినా వచ్చిఉండేది. ఏదో అవసరమైన పనుల్లో చిక్కు కొన్నట్లుంది. బతికిపోయావు. నీకన్నీళ్ళు నీగుండెను తేలిక పరచవచ్చు. కానీ ఎదుటి వ్యక్తిముందు నిన్ను చాలా తేలికపరస్తాయి. ఆపుకో! అమ్మ రాయించిన ఉత్తరాన్ని చదువు.

"చదువుతాను."

"చదువు మరి!"

"సిన్నోడా! నువ్విప్పుడు పెద్దోడివి. ఎంత పెద్దోడివంటే నీ కన్నతల్లి కంటపడలేనంత పెద్దోడివి. నిన్ను పెద్దోణ్ణి చెయ్యాలనే నేననుకొనింది. ఆరాటపడింది. నేననుకొనిందాని కంటే ఎంతో పెద్దోడివై పొయ్‌నావు. నాకింకేఁవీ దిగులల్లేదు నాయినా! అందుకే టిక్కట్టు కొనుక్కుణ్ణాను.

సిన్నోడా! నువ్వు సిన్నోడుగా ఉండేటప్పుడు మనఊరి కెగుదాల బాటమింద ఒకటే ఒక్క బస్సు. పొద్దుమొలిసేటప్పుడు దిగబడిపోతే పొద్దుమునిగేటప్పుడు ఎగబడి పోతావుండేది! ఇప్పుడెర్ర బస్సులొచ్చినాయి. ఒక్కమోపన పోతావుంటాయి ఎగబడీ దిగబడీ! అవి ఎప్పుడొస్తాయో? ఎప్పుడు పోతాయో? వాటికే తెల్దు. టిక్కట్టు సేతిలో ఉండాది. ఎప్పుడే బస్సెక్కి పోతానో నాకేతెల్దు!"

"మిష్టర్ బాలకృష్ణా! ఒకవేళ నువ్వు వెళ్ళేటప్పటికే ఆ తల్లి ఏ ఎర్రబస్సయినా ఎక్కేసుంటే?

"అలా జరగడానికి వీల్లేదు!"

"ఏమిటా ఆవేశం?– ఎవరిమీద నీ అధికారం? నువ్వు వీల్లేదంటే అదిరిపడి ఆగిపొయ్యే దానికి నీ ఆఫీసులో గుమాస్తా కాదు బాలకృష్ణా!"

"అయితే నే నిప్పుడేం చేయాలి?"

"అదే ఆలోచించమంటున్నాను. కన్నకొడుకుగా కాకపోయినా ఓ మనిషిగా!"

"ఇన్నాళ్ళూ మనిషినన్న సంగతే మరిచిపోయాను."

"తల్లికిబిడ్డ అన్నసంగతే మరిచినపుడు అదేమంత గొప్పసంగతి కాదు."

"అవును. పిచ్చి వ్యామోహంలోపడి తనకలాడాను. ఏది ఏమైనా సరే! ఇప్పుడే వెళ్ళి నాతల్లిని నాఇంటికి తెచ్చుకొంటాను. పువ్వుల్లో పెట్టి........"

"హ్హహ్హహ్హ! తీరా నువ్వు వెళ్ళేటప్పటికి పువ్వులే అవసరమవుతాయేమో?"

"అపు అక్కడికి నీ వాగుడు."

బాలకృష్ణ విసురుగా పైకి లేచాడు.

అంతకంటే విసురుగా బయటికి నడిచాడు!

*   *   *   *   *

బాలకృష్ణ ఊరికి ఎగుదల బాటమీద దిగబడి వచ్చిన బస్సును దిగే సరికి కనుచీకటి అవరిస్తూ ఉంది. ఇంతవరకు అతన్ని- అతనితో కలిసి అందరి బరువుబాధ్యతల్ని బాధ్యతగా మోసుకొని వచ్చిన బస్సు అతన్ని మాత్రందింపి చల్లగా జారుకొనింది పెద్దగా రొదచేస్తూ.

'అమ్మకు ఎలా ఉందో?' అన్న ఆందోళనతో గుండె గుబగుబలాడుతూ ఉంది. మనిషి మెలికలు తిరిగిపోతున్నాడు. కనుచీకటి అవరిస్తున్న వేళలో అడ్డదారిమీద పడి గబగబ నడుస్తున్నాడు బాలకృష్ణ!

"ఒరే! పాప్మాముసిల్ది. మొన్నియ్యరవకాడనుంచీ కొటకలాడతానే ఉండాది. వచ్చిన పాణంగాదు. పొయ్యిన పాణంకాదు. వాడాయదవ బాలకిష్టుడొచ్చుంటే_ఇయ్యరవకెప్పుడో నిమ్మతిగా పొయ్యేపాణం?"

"అదంతేలేరా దానెమ్మను గొట్టిన పాణం. కలవరం పెట్టుకుణ్ణిదంటే ఒకరాగాన పోదు. వాణ్ణి సూళ్ళా ! సీంపర చవోళ సిద్దులుగాణ్ణి. పిసనారి నాకొడుకు, సిల్లర దుడ్లు దోటిసెంబులో పోసుకోని సెవలకాడ గిలకరిస్తేనే కదా పొయ్యింది."

"వాణ్ణేదో అట్టంటా ఉండావు. ఈడు సిరిపిరెడ్డిగారి నడిపిరెడ్డి గెతి ఏంవాయెరా? తొలిసి తీర్తానికి బొదులు నీళ్ళల్లో సిల్లరదుడ్లేసి గిలకరించి గొంతులో పోస్తేనేకదా గురుడు గుట్టెక్కింది"

"అదంతేలేరా! ముసిల్దానికి కొడుకంటే పాణం. ఆపాణం వస్తే గదరా ఈపాణం పొయ్యేదానికి!"

"ఊరికే అన్నారంట్రా పెద్దోళ్ళు!- కన్న పేగునుకోసి కల్లమిందేస్తే కూడా 'కొడకా! కొడకా!' అని కొటకలాడితిందంట!"

చేలల్లో పనులు ముగించుకొని అప్పుడే ఇంటిముఖం పడుతున్న రైతులు తలకొక్క తీరుగా మాట్లాడుతున్నారు!

ప్రశాంతంగా ఉన్న ఆ సంజవేళలో బాలకృష్ణ చెవులు చిల్లులు పడుతున్నాయి. తల దిమ్మ తిరిగిపోతూ ఉంది. భరించడం తరంగాకుండా ఉంది. కంపలమీద కయ్యలమీద పడి కాలికొద్దీ పరుగెత్తుతున్నాడు!

అక్కడ గుడిసెలో–

"వాడొచ్చేదీ లేదు. సచ్చేదీ లేదు. సెంబులో నీళ్ళన్ని పెట్టండి. రెడ్డోరి ఇంటెనక్కి పొయ్యి అంత తొళిశాకు గిల్లుకోని రండి. కాళ్ళకింద పోసేదానికి దోసెడు వడ్లగింజలైనా ఉండాయో లేదో? సూడండి. తలకాడికి దీపం కావద్దా? ఈ గుడిసెలో ఉండేది కిరసనాయిలు బుడ్డీ దీపంగా ఉండాదే? ఒక పంవిద తెచ్చి అంత సంవురు పోసిపెట్టండి, ఇప్పుడో ఇంకొంచేపిటికో మంచంమిందనుండి దించేయాల్సిందేకదా?"

ఊళ్ళో తలనెరిసిన పెద్దలు గుడిసెముందు కూర్చొని తలపోసుకుంటున్నారు.

"అదో! బాలకిష్టు దొచ్చేసినాడు!"

"వచ్చేసినాడా? వచ్చేసినాడా?"

బాలకృష్ణ రావడం వింతల్లోవింతగా మారి ఆగుంపులో కలకలం బయలుదేరింది.

అంతవరకు నీటినుండి పెరికి ఎర్రని ఎండలో పారేసిన అల్లికాడలా మంచానికి అతుక్కొని పడిఉండిన ముసలికాయంలో కాసంత కదలిక!

వడలి రాలిపోవడానికి సిద్ధంగా ఉన్న పూరేకుల్లాంటి కనురెప్పలు మెల్లగా విచ్చుకొన్నాయి.

అందరివైపు ఒకసారి తేరిపార చూసేదానికి ప్రయత్నం!

'అమ్మా!' అని అరుస్తూ బాలకృష్ణ మంచం పక్కన కుప్పగా కూలి పోయాడు!

ఎలా కూడగట్టుకొనిందో శక్తిని ఆ ముసల్ది.

ఓ చెయ్యి మెల్లగా పైకి లేచింది!

అది ఎత్తి పెంచిన చెయ్యి. అన్నం తినిపించిన చెయ్యి. ఒడిలో వేసుకొని జోకొట్టిన చెయ్యి. ఇంతటి వాణ్ణిగా తీర్చిదిద్దిన చెయ్యి!

బాలకృష్ణ తల ఆధారంగా తడబడుతూ ఉంది!

బతుకు బరువును మొయ్యలేని కొడుకు చేతి బరువును మోస్తున్నాడన్న తృప్తి కాబోలు!

"నాయినా! బాలకిష్టా! వచ్చేస్తివా నాయనా!"– తిరగలేక తిరుగుతున్న పెదవి మలుపుల నుండి అందుతున్న భాష! ఆతల్లి హృదయఘోష!!

"అమ్మా! బాలకృష్ణుణ్ణి కాదమ్మా! నీ సిన్నోణ్ణమ్మా! సిన్నోణ్ణి!"

"సిన్నోడివి కాదు నాయనా! బాలకిష్టుడివి"– అన్న భావన చిరునవ్వుగా బోసి పెదాలపై వెలిసి వెలవెలపోయింది.

చావు తెలివి అంటున్నారెవ్వరో!

"అమ్మా! ఏంవీ వద్దు. నాకేంవీ వద్దు. నన్ను, 'సిన్నోడా' అని ఒక్కసారి పిలువమ్మా! ఒక్కసారి నోరారా పిలువమ్మా!"

మంచంకోడుకు తల బాదుకొంటూ విలపిస్తున్నాడు బాలకృష్ణ.

"అంత తొళిసితీర్థం గొంతులో పోసేదానికయ్యాడా లేకుండా పాయనే! అఁ! దేనికైనా ఋణంవుండాల!" అని నిట్టూరుస్తూ మంచంమీది నుండి కిందికి దించుతున్నారా జీవంలేని కట్టెను!

దించేటప్పుడు పైటకొంగు తొలిగింది!!

వాడి వత్తలైన అమ్మ రొమ్ములు. తనకు పాలిచ్చిన రొమ్ములు. శివుని గుడిలో విభూతి తిత్తుల్లా వేలాడుతున్నాయి.

బాలకృష్ణ చూశాడు. చూడలేక కళ్ళు మూసుకొన్నాడు.

"ఈ పైటచెరగు మరుగులోనే ఇంత వ్యక్తిత్వాన్ని పెంచుకొన్నాను. మరో పైటచెరగు మరుగుకోసం ప్రాకులాడి వ్యక్తిత్వాన్నే చంపుకొన్నాను. నేను మనిషిని కాను. నేను మనిషిని కాను."

ఆ మరసటి రోజు ఉదయాన ఆమె అంతిమ యాత్రకు చేయాల్సిన ఏర్పాట్లకై కొందరు మల్లగుల్లాలు పడుతూంటే- ఆ రాత్రి శవజాగరణకు మరి కొందరు వంతులుపోతున్నారు.

చివరిసారిగా 'సిన్నోడ' అని పిలిపించుకోలేక పోయిన బాలకృష్ణ గుడిసెముందు కూలబడి కుమిలికుమిలి ఏడుస్తున్నాడు!

"ఒరే పిచ్చివాడా! ఎందుకలా ఏడుస్తావ్? కన్నీళ్ళు మందిని మెప్పిస్తాయి కానీ మాతృ ఋణాన్ని తీర్చలేవురా!"

ఆ స్థితిలో కూడా ఉలిక్కిపడ్డాడు బాలకృష్ణ!

ఎవరన్నారీమాట? అని చుట్టూ కలయచూశాడు. ఎవరిపనుల్లో వాళ్ళున్నారు. అనడానికి ఎవరున్నారు? అంతవరకు స్తబ్దంగా ఉన్న అంతరాత్మ మేలుకొనిందని తోచేసరికి బాలకృష్ణ హృదయవిదారకంగా ఏడుస్తున్నాడు ఒక్క ఓదార్పుమాటకు కూడా నోచుకోలేక! ●

ఆంధ్రభూమి
(జన్మదిన ప్రత్యేక సంచిక, 15, ఆగస్టు 1981)
ప్రథమ బహుమతి